## క్లుప్తంగా

### ఉపాధ్యాయుల బదిలీలు నిలిపివేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఆసిఫాబాద్:** జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు నిలిపివేయాలని అఖిల పక్షం నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. బోధనా సిబ్బందిని బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేయడంతో ఆసిఫాబాద్, సిర్పూర్–యూ మోడల్ స్కూళ్లలో పోస్టులన్నీ ఖాళీ అయ్యాయని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం మధ్యలో బదిలీలు చేయడంతో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర నష్టపోతారని, వెంటనే బదిలీలు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, ఖాండ్రే విశాల్, జయరాజ్, కార్తీక్, చిరంజీవి, మురళీ, సలీం, జీవన్, ప్రశాంత్, టీకానంద్, వినోద్, భీమేశ్ ఉన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

**తిర్యాణి:** పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం మండలంలోని చింతపెల్లి గ్రామ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆయాన గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 3550 స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు చేపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**దహెగాం:** మండల కేంద్రంతో పాటు చిన రాస్పెల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని సహకరించాలని కోరారు.

### 'ఐసీడీఎస్' యథావిధిగా కొనసాగించాలి

**ఆసిఫాబాద్:** కీలకమైన ఐసీడీఎస్‌ను యథావిధిగా స్వతంత్రంగా కొనసాగించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.త్రివేణి మాట్లాడుతూ వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆర్యా తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో మూడో తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి, పేద ప్రజలకు సేవలను దూరం చేయొద్దన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఉపాధికి నష్టం కలిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వనిత, సువర్ణ, సరోజ ఉన్నారు.

### వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్:** ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని డీఎం విశ్వనాథ్ అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపో ఆవరణలో శుక్రవారం గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డీ ఎం మాట్లాడుతూ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ రెండో విడతలో భాగంగా సిబ్బంది జీవిత భాగస్వామికి వైద్య పరీక్షలు నిర్వహించేందు కు ఈ నెల 24 వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సరియా, నాగరాజు, ప్రేమల పాల్గొన్నారు.

### తప్పిన ప్రమాదం

**కాగజ్‌నగర్‌రూరల్:** మండలంలోని అంకుసాపూర్ శివారులో గల పంట చేనులో పనిచేసేందుకు వెళ్లిన తాక్రె గోవిందు, నీలాబాయి దంపతుల సమీపంలో శుక్రవారం పిడుగు పడింది. దీంతో వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా.. పంట చేనులో ఉన్న ఎద్దు పిడుగుపాటుకు మృత్యువాత పడింది. ప్రస్తుతం దంపతుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

### మహాగావ్‌లో వైద్య శిబిరం

**నార్నూర్:** మండలంలోని మహాగావ్, మాన్కాపూర్ గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబా బు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల ఆరో గ్యంపై ఆరా తీశారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. ఇంటి ఆవరణంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

# పౌష్టికాహారం.. ఆరోగ్యం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌మాసం
- పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన
- గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- ఈనెల 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

**కౌటాల:** ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా పోషణ్ మాసం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 1 నుంచి 30 వరకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని కుటుంబాలు వీటిని అందిపుచ్చుకోవడం లేదు. రోజువారీ కూలీలుగా పని చేసే కుటుంబాలు పోషణ విషయంలో శ్రద్ధ చూపడం లేదు. ఇటువంటి కుటుంబాలకు పోషణ మాసోత్సవాల్లో పోషకాహారం అందించనున్నారు.

**పోషణ కేంద్రాలు..**

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల బరువు, ఎత్తును రోజువారీగా పరిశీలించి, పోషకాల లోపం ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందజేస్తున్నారు. పప్పులు, కోడిగుడ్లతో కూడిన ఆహారం ప్రతీరోజు మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారు. రక్తహీనత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

| జిల్లాలో వివరాలు ఇలా.. |
|---|
| ఐసీడీఎస్ ప్రాజెక్టులు 5 |
| అంగన్‌వాడీ కేంద్రాలు 973 |
| బాలింతలు 3,600 |
| గర్భిణులు 5,113 |
| 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు |
| పిల్లలు 16,583 |
| 3–6 ఏళ్లలోపు చిన్నారులు 20,739 |

**ఈనెలాఖరు వరకు..**

పోషణ మాసోత్సవం సెప్టెంబర్ 1న ప్రారంభమైంది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో గ్రామీణస్థాయిలో రోజూ ఒక కార్యక్రమాన్ని ఎంపిక చేసుకొని సెప్టెంబర్ 30 వరకు నిర్వహిస్తారు. పిల్లలకు ఆట పాటలు మాత పోషణ, తక్కువ బరువు, ఎత్తు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లడం, కిశోర బాలికలకు సూచనలు, ఆరోగ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, గర్భిణులకు, సీమంతలు, పిల్లలకు అక్షరాభాస్యం, అన్నప్రసన కార్యక్రమాలను పండుగ వాతావరణంలో చేపడుతున్నారు. పౌష్టికాహార లోపం ఏ ఊరిలో ఉండవద్దనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**



ప్రతీ ఏటా సెప్టెంబర్ మాసంలో పోషణ మాసం కార్యక్రమం ద్వారా ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటాం. తప్పనిసరిగా షెడ్యూల్ ప్రకారం పోషణ మాసం నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించాం

– షకీరా బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కౌటాల

**పకడ్బందీగా కార్యక్రమాలు**



ప్రస్తుతం పిల్లల ఎదుగుదలకు పోషకాహార లోపం అనేది అవరోధంగా మారింది. తల్లిదండ్రులు పోషకాహారంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. విటమిన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా వాడాలి. పోషణ మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

– విజయలక్ష్మి, సీడీపీవో, సిర్పూర్(టి)

## ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**పెంచికల్‌పేట్:** మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సతీష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనర్థి హల్దార్, మాధురి, ధర్మరావు, ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మి, సావిత్రి, సోనీ, హెచ్ఎం గోపాల్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కంటి వైద్యశిబిరానికి స్పందన**

**దహెగాం:** మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ సింగరేణి, శాంభవి ఐ విజన్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. 94 మందికి కంటి పరీక్షలు చేశారు. 23 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. మరో నలుగురిని హైదరాబాద్ సరోజిని కంటి దవాఖానాను తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఫాస్టర్ డెవిడ్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.


### నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

**బెజ్జూర్:** ఆదివాసీ మహిళపై ఆత్యాచారయత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండల ఆదివాసీ కొలవార్ మన్నెవార్ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తుడుందెబ్బ పిలుపు ఆదివాసీ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. మహిళను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. శనివారం నిర్వహించే బంద్‌లో వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సమావేశంలో పెద్దల శంకర్ కొలవర్, ఆత్రం బక్కయ్య, మానేపెల్లి మల్లేష్, మేడి సతీష్, పోల్క వెంకటేశ్, ప్రకాష్, నగేశ్, గొంతు, వెంకటి, కల్యాణ్ పాల్గొన్నారు.

### కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

**కౌటాల:** మండల ఆర్యవైశ్య కార్యవర్గానిన శుక్రవారం కన్యాక పరమేశ్వరి ఆలయ ఆవరణంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఎల్క సిద్దేశ్వర్, ఉపాధ్యక్షుడిగా ఎల్క వెంకటేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా రాచకొండ ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా ఎలుక మురళీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వొజ్జల వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, సుగుణాకర్, వెంకన్న, చక్రపాణి పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



కందకం తవ్విస్తున్న ఏడీ గంగాధర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు

**రెబ్బెన:** మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ గంగాధర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావులు హెచ్చరించారు. శుక్రవారం నంబాల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా కందకాలు తవ్వించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు లారీల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు వస్తున్న సమాచారం మేరకు ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గంగాపూర్, లక్ష్మీపూర్, పులికుంట వాగుల వద్ద కందకాలు తవ్విస్తామన్నారు. ఇసుక అవసరమైన ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రేంకిరణ్, తదితరులు ఉన్నారు.

## 'చలో సంగారెడ్డి' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కేశవరావు

**ఆసిఫాబాద్:** గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మానిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో భాగంగా రేషన్ డీలర్లకు క్వింటాల్ బియ్యానికి రూ. 300 కమీషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో మాట్లాడారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఈనెల 24న చలో సంగారెడ్డి రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డీలర్లు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో రేషన్ డీలర్ల కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వాలు మారినా డీలర్ల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్లకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాపర్తి శ్రీనివాస్, జాడి ఆత్మారాం, శంకర్, సత్యనారాయణ గౌడ్, గోపాల్, తిరుపతి, సుధాకర్, పాండురంగ, ధరుంబాయి, భీమ్‌రావు, ప్రవళిక, సతీశ్, రవీందర్, నాందేవ్, తిరుపతి పాల్గొన్నారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న ఏఈవో శివకుమార్

**పెంచికల్‌పేట్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గొంట్లపేట్ పెద్దవాగు పరివాహక ప్రాంతంలో దెబ్బతిన్న పత్తి పంటలను ఏఈవో శివకుమార్ పరిశీలించారు. నష్టపోయిన పంటల రైతుల వివరాలను నమోదు చేశారు. పత్తి పంటలో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, రైతులు ఉన్నారు.

## పోరాటంతోనే వాటా చెల్లింపు ప్రకటన

**రెబ్బెన:** సింగరేణి లాభాలను ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి వ్యాప్తంగా టీబీజీకేఎస్ ధర్నాలు చేయడంతో ప్రభుత్వం స్పందించి లాభాలను ప్రకటించిందని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. సింగరేణి రూ. 3వేల కోట్ల నికర లాభాలు అని చెప్పిన యాజమాన్యం ఇప్పుడు నికర లాభం రూ. 2388 కోట్లుగా ప్రకటించటం అనుమానాలకు తావిస్తోందన్నారు. అంతే కాకుండా కార్మికులు 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తుండగా.. కేవలం 33 శాతం మాత్రమే వాటా చెల్లించేందుకు అంగీకరించడం కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కాంట్రాక్టు కార్మికులు సైతం భాగస్వాములు అవుతున్నారని అలాంటి వారికి బోనస్ ప్రకటించటం పట్ల టీబీజీకేఎస్ హర్షం వ్యక్తం చేస్తోందని అన్నారు.

### వినూత్న కార్యక్రమాలతో చదువుపై ఆసక్తి



విద్యార్థులకు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

**రెబ్బెన:** రోజు వారి విద్యా బోధనలే కాకుండా వినూత్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని సోనాపూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు జాడి నీల అన్నారు. మారుమూల ప్రాంతమైన సోనాపూర్‌లో శుక్రవారం విద్యార్థులకు మొబైల్ ప్లానిటోరియం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సోలార్ సిస్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, రైమ్స్‌తో పాటు సముద్రపు జంతువులు వంటి అంశాలను ప్రదర్శించారు. సోనాపూర్ వంటి మారుమూల గిరిజన విద్యార్థులకు వినూత్న కార్యక్రమాల ద్వారా అందిస్తున్న విద్యాబోధన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## పోడు పట్టాలు ఇవ్వాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**బెజ్జూర్:** పోడు భూములకు పట్టాలు ఇచ్చి సమస్యను పరిష్కరించాలని ఆదివాసీ కొలవార్ (మన్నేవార్) సేవ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కోరారు. శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెజ్జూర్ మండల ఆదివాసీ కొలవార్ (మన్నేవార్) సేవ సంఘం నాయకులు మాట్లాడుతూ బెజ్జూర్‌లో కొలవార్ సంఘ భవనం కోసం స్థలం ఉందని, భవనానికి నిధులు కేటాయించాలన్నారు. పీవీటీజీ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంఘ భవనం టెండర్ త్వరలో వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం బక్కయ్య, మెడి సతీష్, పోల్క వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సీసీరోడ్లు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న గ్రామస్తులు

**రెబ్బెన:** మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీలో బీసీ, ఎస్సీ కాలనీలకు అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల్లో పూర్తిస్థాయిలో సీసీరోడ్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే అంతర్గత రోడ్లు బురదమయంగా మారుతున్నాయని అన్నారు. సైడ్ డ్రైన్‌లు లేకపోవటంతో మురుగు నీరు రోడ్లపై పారుతోందన్నారు. స్పందించిన కలెక్టర్ సీసీరోడ్లతో పాటు డ్రైనేజీలు మంజూరు చేసే దిశగా కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఇగురపు సంజీవ్, ఇగురపు రమేశ్, నగోషా చుక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌బజార్ వినియోగంలోకి తీసుకురావాలి



వినతిపత్రం అందచేస్తున్న ఎస్.తిరుపతి, నాయకులు

**రెబ్బెన:** సింగరేణి కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సింగరేణి సూపర్ బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శుక్రవారం గోలేటిలోని సింగరేణి సూపర్ బజార్ సందర్శనకు వచ్చిన సూపర్‌బజార్ల ఎండీ విలాస్ పోతేదార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. మూరుమూల ప్రాంతాల్లో ఉన్న బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు సూపర్‌బజార్‌లో దొరికేవన్నారు. సూపర్‌బజార్‌లో పని చేసే సిబ్బంది అవినీతికి పాల్పడ్డారనే సాకుతో గత కొన్ని నెలలుగా సూపర్ బజార్‌ను మూసివేయటంతో కార్మికులు నిత్యవసర వస్తువుల కోసం ఇబ్బందికి గురవుతున్నారని అన్నారు. అధిక ధర చెల్లించి మార్కెట్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. కార్మిక సంక్షేమ కార్యకలాపాలను ఏరియాలో పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి

**కౌటాల:** కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం కౌటాల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని గదులను పరిశీలించి నవజత శిశువు ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి జనరేటర్, ఓటీ టేబుల్, లైట్లు, ఫ్యాన్లు, వీల్‌చైర్లు పరికరాల అవసరం ఉందని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, నాయకులు ఉన్నారు.

## ఏరియాలో జీఎం సీపీపీ పర్యటన



ఓసీపీ పని స్థలాలను పరిశీలిస్తున్న జీఎం సీపీపీ రమేశ్

**రెబ్బెన(ఆసిఫాబాద్):** బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం జీఎం కార్పొరేట్ ప్రాజెక్టు, ప్లానింగ్ (సీపీపీ) రమేశ్ పర్యటించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్, ఎస్‌వోటూజీఎం రాజమల్లుతో పాటు ఇతర అధికారులతో కలిసి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సందర్శించారు. ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఓసీపీకి సంబంధించిన ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్షిక లక్ష్యంతో పాటు ఇప్పటి వరకు సాధించిన ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలించారు. అలాగే కైరిగూడ ఓసీపీ పని స్థలాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, మేనేజర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

**బెజ్జూర్:** సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ప్రస్తుతం రూ.5వేల గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. ఈవిషయాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లినా.. వేతనాలు పెంచే విధంగా చూడాలని కోరారు. సాకులు చెబుతూ విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే డీఆర్‌డీవో దత్తుతో ఫోన్‌లో మాట్లాడారు. వీవోఏల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దల సంతోష్, పొట్టి విలాస్, దుర్గం శ్యాంసుందర్, సడమేక కళంగిరి, శంకర్, మాచర్ల సురేశ్, మోర్లే మధుసూదన్, నీలయ్య, ఆత్రం మాధవరావు, గోరంట్ల విజయకుమార్, కొరితే సుజాత పాల్గొన్నారు.